భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

- శిథిలావస్థ ఇండ్లలో నివాసం ఉండొద్దు
- అధికారులు ముందస్తు జాగ్రత్త చేపట్టాలి
- కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, జూలై 20 : బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా నాగర్‌కర్నూల్ జిల్లాలో వర్షాలు నిర్విరామంగా కురుస్తున్నాయని, రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రెవెన్యూ, అత్యవసరశాఖల అధికారులు అవసరమైన ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని కలెక్టర్ బదావత్ సంతోష్ శనివారం ప్రకటనలో ఆదేశించారు. వాతావరణశాఖ అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో రానున్న మరో రెండు రోజులు జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాల కారణంగా జిల్లాలో ప్రాణ, ఆస్తినష్టాలు జరగకుండా అధికారులు నివారణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జిల్లాలో చెరువు కట్టలు తెగిపోకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆర్డీవోలు, తాసీల్దార్లు, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండి శిథిలావస్థలో ఉన్న ఇండ్లను గుర్తించి అందులో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ స్తంభాలకు ప్రజలు దూరంగా ఉండాలని, కరెంటు షాట్ సర్క్యూట్ కారణంగా పశువులకు, ప్రజలకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, వర్షాలు కురుస్తున్నందున దోమలు, వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో ప్రతి శుక్రవారం డ్రైడేను నిర్వహించి పారిశుధ్యం కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ముంచెత్తిన ముసురు

- రోడ్లపై నిలిచిన వర్షపు నీరు
- కూలిన పాడుబడిన ఇండ్లు
- పరిశీలించిన అధికారులు

నాగర్‌కర్నూల్ : ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపునీరు

నాగర్‌కర్నూల్, జూలై 20 : నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తురన్నది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం నేపథ్యంలో శుక్రవారం మధ్య రాత్రి నుంచి జిల్లా కేంద్రంలోపాటు అన్ని మండలాల్లోనూ వర్షం కురుస్తోంది. నాగర్‌కర్నూల్ పట్టణంలోని అన్ని వీధుల్లో జలమయమయ్యాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా 24గంటల వర్షపాతం సగటున 14.8 శాతం నమోదైంది. వంగూరు, ఉప్పునుంత, అమ్రాబాద్, పదర మండలాల్లో మినమా అన్ని మండలాల్లోనూ 10నుంచి 30 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. శనివారం ఉదయం నుంచి నాగర్‌కర్నూల్ పట్టణంతోపాటు పలు మండలాల్లో ముసురువర్షం కురుస్తూనే ఉంది. ముసురు వర్షం కారణంగా నాగర్‌కర్నూల్ పట్టణంలో ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే సమయాల్లో ముసురు వర్షం కురవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.

పెంట్లవెల్లిలో..

పెంట్లవెల్లి, జూలై 20 : కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాల్లోని ఆయా గ్రామాల్లో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా ముసురు వర్షం కురిసింది. ఉదయం నుంచి వర్షం కురుస్తుండడంతో పాడుబడిన మట్టి ఇండ్లు కూలుతున్నాయి. శనివారం తెల్లవారుజామున కొల్లాపూర్ మండలం రామాపురం గ్రామానికి చెందిన గడ్డం వెంకటయ్య మట్టి ఇల్లు కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవ్వరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఎండతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇంటికే పరితమయ్యారు. ప్రజలు అప్రమతంగా ఉండాలని రెవెన్యూ, పంచాయతీ శాఖల అధికారులు హెచ్చరిస్తున్నారు. జూరాల ప్రాజెక్టు నుంచి వరద నీరు దిగువకు వదలడంతో కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నదీతీర గ్రామాల ప్రజలు చేపల వేటకు వెళ్లొద్దని పోలీసులు, రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీచేస్తున్నారు.

చారకొండలో..

చారకొండ, జూలై 20 : మండలంలో కురుస్తున్న ముసురు వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాసీల్దార్ కేసీ ప్రమీల అన్నారు. శనివారం మండలంలో కురుస్తున్న ముసురు వర్షానికి కూలిన మట్టి ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన సరోజన, లక్ష్మమ్మ, సుగుణమ్మలకు చెందిన ఇండ్ల పైకప్పు కూలాయని, వాటి వివరాలను కలెక్టర్‌కు నివేదిక పంపించామని చెప్పారు. కురుస్తున్న వర్షాలకు శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ప్రజలు ఉండకూడదని, వారికి ప్రత్యామ్నాయంగా చారకొండలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్థావరం కల్పిస్తున్నట్లు చెప్పారు. శిథిలాస్థకు చేరిన ఇండ్లు ఉంటే తమకు సమాచారం అందించాలని అన్నారు. ఇండ్ల పరిశీలించిన వారిలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బాల్ రాంగౌడ్, ఆర్ఐ రామకృష్ణ, మహేందర్ ఉన్నారు.

ఉప్పునుంతలలో..

ఉప్పునుంతల, జూలై 20 : ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ అమర్‌సింగ్ సూచించారు. వ్యవసాయ పొలాల మధ్య కరెంట్ స్తంభాలు, తడిగా ఉన్న ఇంటి గోడలు, మోటరు స్టార్టర్లు, తెగిపడిన విద్యుత్ తీగలు, సర్వీస్ వైర్లు తాకకూడదన్నారు. ఏదైనా సమస్య ఉంటే సంబంధిత అధికారులు, సిబ్బందికి, విద్యుత్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

పెంట్లవెల్లి : రామాపురంలో వర్షానికి కూలిన మట్టి ఇల్లు

సైబర్ బారిన పడకండి

ఉప్పునుంతల, జూలై 20 : రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం రైతులకు రూ.లక్ష లోపు రుణమాఫీ చేసిన సందర్భంగా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై లెనిన్ శనివారం ప్రకటనలో తెలిపారు. రుణమాఫీ సంతోషంలో రైతులు ఉండడంతో ఇదే అదనుగా సైబర్ కేటుగాళ్లు రైతుల అకౌంట్లను హ్యాక్ చేసే ప్రమాదం ఉందని రైతులు జాగ్రత్త పడాలని సూచించారు.

నిలిచిన కాళేశ్వరం ప్రాజెక్టు

కల్వకుర్తి, జూలై 20 : కాంగ్రెస్ పార్టీ చేసిన కుట్రలను తట్టుకుని కాళేశ్వరం ప్రాజెక్టు నిలిచిందని కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం అన్నారు. మేడిగడ్డ కుంగిపోయింది, కాళేశ్వరం కొట్టుకుపోయిందని కాంగ్రెస్ పార్టీ, యూటూబ్ ఛానళ్ల కుట్రలు, కుంతంత్రాలను కడిగేస్తూ లక్షల క్యూసెక్కుల వరదనీరు మేడిగడ్డ వద్ద ప్రవహిస్తుందని ఎడ్మ సత్యం పేర్కొన్నారు. కేసీఆర్‌పై కక్షతో కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎవ్వరు బురదజల్లిన వారు చరిత్రలో హీనులుగా మిగిలిపోవడం ఖాయమన్నారు. రూ.లక్ష రుణమాఫీ కేవలం 22 శాతం రైతులకు మాత్రమే వర్తిస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించిన జాబితాల ద్వారా తెలుస్తుందన్నారు. వానకాలంలో రైతుబంధుకు ఇవ్వాల్సిన డబ్బులను రుణమాఫీకి మళ్లించిందని పేర్కొన్నారు.

రెయిన్‌కోట్లు పంపిణీ

కల్వకుర్తి, జూలై 20 : కల్వకుర్తి మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందికి రెయిన్‌కోట్లు, సేఫ్టీ మెజర్స్‌లను మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికుల భద్రతకు పెద్ద పీట వేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ షాహెద్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభను తెలుసుకోవాలి

ఉప్పునుంతల, జూలై 20 : పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రులు పూర్తి సహకారం అందించాలని పలువురు ఉపాధ్యాయులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బాలుర ప్రాథమిక పాఠశాల, తిప్పాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థుల ప్రతిభను ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు తెలుసుకోవాలని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్ఎంలు బాలమణి, సోమ్ల, ఉపాధ్యాయులు అనిల్, వెంకటేశ్, శ్రీనివాసులు, తల్లిదండ్రులు లింగమయ్య, పర్వతాలు, రాంచంద్రయ్య, తిరుపతయ్య, కురుమయ్య, మల్లయ్య, సునిత ఉన్నారు.

విద్యార్థులకు బ్యాగులు, బూట్లు పంపిణీ

తిమ్మాజిపేట, జూలై 20 : మండల కేంద్రంలోని బోయగేరి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆశ్రయ ఫౌండేషన్ సంస్థ బ్యాగులు, బూట్లు, మ్యాట్లను పంపిణీ చేశారు. శనివారం పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించగా ఈ సమావేశాని హజరైన ఫౌండేషన్ ప్రతినిధులు గోపినాథ్, సువర్ణలత, ఎంఈవో శ్రీనివాసులుతో కలిసి విద్యార్థులకు బ్యాగులు, బూట్లు, మ్యాట్లను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జైపాల్‌రెడ్డి, నందకిశోర్, ఎల్లయ్య విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వృత్తిలో రాణించేందుకు వైజ్ఞానిక ప్రదర్శన తిలకించాలి

- ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, జూలై 20 : తాము చేస్తున్న వృత్తిలో రాణించాలంటే విధిగా వైజ్ఞానిక ప్రదర్శనలను తిలకించాలని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్ రెడ్డి అన్నారు. ఫొటో, వీడియోగ్రఫీ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారు వస్తున్న మార్పులను అధిగమించేందుకు తెలంగాణ ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించాలన్నారు. శనివారం క్యాంప్ కార్యాలయంలో ప్రదర్శనకు సబంధించిన గో డపత్రికను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి ఆధునిక సాంకేతిక రంగం అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఫొటో చిత్రీకరణలో అనేక మార్పులు వస్తున్నాయని, వాటిని అధ్యయనం చేసేందుకు ఈ ప్రదర్శన ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఫొటో, వీడియో గ్రాఫర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నేతాజీగౌడ్, పట్టణాధ్యక్షుడు రాఘవులు, ప్రధాన కార్యదర్శి బెల్లం నర్సింహ, కోశాధికారి శివ, ఏటిగడ్డ వెంకటేశ్, సురేశ్, కపిలవాయి రాజు, తాలూకా అధ్యక్షుడు వీరేందర్‌గౌడ్, శ్రీనుభూషిపాగ, కిశోర్, దేవగౌడ్, సూరజ్, రామకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేట, జూలై 20: పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా ఉచిత శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శనివారం అచ్చంపేటలోని ఏరియా దవాఖానలో హైదరాబాద్ కేర్ దవాఖాన, నీబియం ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కార్డియాక్ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, ట్రస్టు చైర్‌పర్సన్ డాక్టర్ అనురాధ శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అచ్చంపేట ప్రాంతంలో ప్రజలు వైద్యంపరంగా ఇబ్బందులు పడకుండా మెగా కార్డియాక్ క్యాంప్‌ను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభు, డాక్టర్ మహేశ్, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయకు దరఖాస్తుల ఆహ్వానం

బిజినేపల్లి, జూలై 20 : బిజినేపల్లి మండలంలోని వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి గానూ ఆరవ తరగతిలో ప్రవేశానికి అర్హత పరీక్షకు హాజరయ్యేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భాస్కర్‌కుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే చదువుతూ ఉండి, విద్యార్థుల తల్లిదండ్రుల నివాసం ఉమ్మడి జిల్లాలోనిదై ఉండాలని సూచించారు. ఆసక్తిగల విద్యార్థులు ఇంటర్నెట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడి సంతకంతో కూడిన ధ్రువపత్రం, ఫొటోతో దరఖాస్తును ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలన్నారు. 2024 సెప్టెంబర్ 16వ తేదీన చివరి తేదీ అని, ఉమ్మడి జిల్లాలోని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, త్వరపడి తమతమ పిల్లలను ప్రోత్సహించి అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకునేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ప్రవేశ పరీక్ష 2025 జనవరి 18వ తేదీన నిర్వహిస్తామన్నారు. వివరాలకు www.navodaya.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

మెరిట్‌కే ప్రాధాన్యం

నవోదయలో ప్రవేశానికి ప్రతిభ గల విద్యార్థుల మెరిట్ తుది ప్రామాణికమని ప్రిన్సిపాల్ అన్నారు. కొన్ని ప్రాంతాల్లో కొంత మంది అభ్యర్థులను, వారి తల్లిదండ్రులను మభ్యపెట్టి డబ్బు ఇస్తే సీట్లు ఇప్పిస్తామని ప్రచారం చేసుకుంటున్నారని, ఇది పూర్తి అవాస్తవమన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నవోదయలో ప్రవేశాలు డబ్బు లేదా సిఫారసులతో సాధ్యం కాదని, పూర్తిగా అభ్యర్థి సామర్థ్యాన్ని బట్టి సీబీఎస్ఈ ద్వారా ఎంపిక చేయబడుతాయన్నారు. ఎవరైనా ఇలా మభ్యపెట్టి, మోసం చేస్తే ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

గిరిజన జిల్లా సంక్షేమాధికారిగా ఫిరంగి

కలెక్టర్‌ను కలిసిన గిరిజన సంక్షేమాధికారి ఫిరంగి

నాగర్‌కర్నూల్, జూలై 20 : నాగర్‌కర్నూల్ జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారిగా ఎం.ఫిరంగి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఆయన కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో డీటీడబ్ల్యూవోగా నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ బదావత్ సంతోష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలో జిల్లా గిరిజన సంక్షేమాధికారిగా విధులు నిర్వహిస్తున్న ఫిరంగి సాధారణ బదిలీల్లో భాగంగా నాగర్‌కర్నూల్‌కు బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఏటీడబ్ల్యూవో కమలాకర్‌రెడ్డి డీటీడబ్ల్యూవోగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తుండగా అతని నుంచి బాధ్యతలు స్వీకరించారు.

వాట్సాప్ స్టేటస్ తెచ్చిన తంటా..

తిమ్మాజిపేట, జూలై 20 : వాట్సాప్ స్టేటస్ పెట్టిన ఒక పోస్టు ఇరువురి మధ్య వాగ్వాదానికి, దాడులకు దారి తీసి పోలీస్‌స్టేషన్‌లో కేసుల దాక వచ్చింది. ఇందుకు సంబంధించి ఎస్సై నరేందర్‌రెడ్డి కథనం మేరకు మండలంలోని మరికల్ గ్రామానికి చెందిన బంధువుల మధ్య వాట్సాప్ స్టేటస్ చిచ్చును రగిల్చింది. సోదరుడి వరుస అయ్యే ఓ వ్యక్తిపై సోదరి చేసిన కామెంట్‌తో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, దీనిపై ఆమె అతన్ని అడగడానికి వెళ్లిన క్రమంలో దాడులు చేసుకున్నట్లు ఫిర్యాదులు అందడంతో మొత్తం ఎనిమిది మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సైబర్ నేరాగాళ్లతో జాగ్రత్త

- ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్, జూలై 20 : సైబర్ నేరాగాళ్లతో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ నేరగాళ్లు చాలా మోసాలకు పాల్పడుతున్నారని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. దేశంలో ఇప్పుడు ఉన్న డిజిటల్ యుగంలో జరుగుతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండి ఎవరికీ ఎలాంటి విషయాలు చెప్పకుండా జాగ్రత్త వహించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సైబర్ నేరాల పట్ల మోసపోకుండా పలు సూచనలు చేశారు. ఫోన్‌కు కానీ, అకౌంట్లకు కానీ స్ట్రాంగ్ లేదా పొడవైన పాస్‌వర్డ్ ఉపయోగించాలని, తరచుగా మార్చుకోవాలని సూచించారు. సోషల్ మీడియా ఖాతాల్లో డేటా గోప్యత సెట్టింగ్ ఉపయోగించాలని, వాటిని ప్రైవేట్‌గా ఉంచాలన్నారు. మొబైల్ అప్లికేషన్లను ఇన్‌స్టాల్ చేస్తున్నప్పుడు కాల్స్, కాంట్రాక్ట్‌లు, మెస్సేజ్‌లు, మీడియా, లొకేషన్‌లను యాక్సిస్ అనుమతించే ముందు ఆలోచించాలన్నారు. వెబ్‌సైట్లను బ్రౌజ్ చేయడానికి ముందు URLలో https కోసం తనిఖీ చేయాలని సూచించారు. అపరిచితులు పంపిన లింకులు, వెబ్‌సైట్లలో పాప్‌యాప్స్‌ను క్లిక్ చేయొద్దని, సీవీవీతోసహా వ్యక్తిగత సమాచారం ఓటీపీ, క్రెడిట్ డెబిట్ కార్డు సమాచారాన్ని చెప్పవద్దని, తప్పుడు సూచనలు చేస్తూ మెయిల్స్‌లో ఫోర్స్డ్‌సైట్లు వీక్షించమని వచ్చే సందేశాలను నమ్మవద్దన్నారు. ఇలా పలు సూచనలు చేస్తూ సైబర్ నేరస్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ ప్రకటనలో సూచించారు.

నలుగురికి జైలుశిక్ష

మద్యం తాగి నలుగురు వ్యక్తులకు రూ.100 చొప్పున జరిమానా జైలుశిక్ష విధించినట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ పేర్కొన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తే జైలు శిక్ష తప్పదని ఎస్పీ హెచ్చరించారు. శిక్షపడిన వారిలో కల్వకుర్తి మండలం మార్చాలకు చెందిన అర్జున్‌కు మూడు రోజుల జైలు, రూ.100 జరిమానా, తాడూరు చెందిన ఆంగోతుకు రెండు రోజుల జైలుశిక్ష, రూ.100 జరిమానా, కల్వకుర్తి మండలం ఎల్లికట్టకు చెందిన సభావత్ మున్యకు రెండు రోజుల జైలుశిక్ష, రూ.100 జరిమానా, కల్వకుర్తి మండలం ముకురాలకు చెందిన బత్తుల పర్వతాలుకు రెండు రోజుల జైలుశిక్ష, రూ.100 జరిమానాను కల్వకుర్తి జడ్జి విధించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఈఏడాది ఇప్పటి వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 15 మందిని జైలుకు పంపినట్లు ఆయన వెల్లడించారు.

వేరుశనగ నూనెలో మంచి పోషకాలు

- శాస్త్రవేత్త జ్యోత్స్న

బిజినేపల్లి, జూలై 20 : వేరుశనగ నూనెలో పోషకాలు మెండుగా ఉంటాయని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త జ్యోత్స్న అన్నారు. శనివారం స్వయం సహాయక బృందాలతో పాలెం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పెద్దకొత్తపల్లిలో ఏర్పాటు చేసిన వేరుశనగ ద్వారా నూనె తీసే కానుగను, విలువ ఆధారిత ఉత్పత్తి కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వేరుశనగలో పోషక విలువలు, వేరుశనగ ఉత్పత్తులపై వివరించారు. వేరుశనగ చెక్కతో చట్నీ పొడర్, లడ్డు తయారీ విధానం, పోషకాల ఆవశ్యకతను ఉద్దేశించి స్వయం సహాయక మహిళలను ప్రోత్సహించారు.

కార్యక్రమంలో డీఆర్‌డీఏ, ఏపీడీ శ్రీనివాస్, డీఆర్డీఏ ఏపీఎం అరుణ, స్వయం సహాయక సంఘం సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

క్లారిటీ లేని రుణమాఫీతో రైతుల్లో ఆందోళన

- బీఆర్ఎస్ నాయకులు

వెల్దండ, జూలై 20 : రుణమాఫీకి ఎవ్వరూ అర్హులు, ఎవ్వరూ అనర్హులు అనే క్లారిటీ లేకుండా ప్రభుత్వం రైతులతో ఆటలాడుతుందని బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు జె. యాదగిరి అన్నారు. శనివారం వెల్దండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హులైన రైతుల ఖాతాలో రుణమాఫీ జమ కాకపోవడంతో రైతులు అందోళన చెందుతున్నారని మండిపడ్డారు. బ్యాంకుల్లో రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న రైతుల్లో 20 శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడే మాటలకు రుణమాఫీకి ఎలాంటి పొంతన లేదన్నారు. సమావేశంలో నాయకులు శేఖర్, అశోక్, శ్రీను, గణేశ్, ఈదుల పల్లి శ్రీను, రవి, మహేశ్, అమ్మనాయక్, భక్యానాయక్ ఉన్నారు.

ఇన్‌స్పైర్ -మానక్ అవార్డుల పోస్టర్ విడుదల

నాగర్‌కర్నూల్, జూలై 20 : ఇన్‌స్పైర్-మానక్ అవార్డులకు సంబంధించిన పోస్టర్లను శనివారం కలెక్టర్ బదావత్ సంతోష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులలో వైజ్ఞానిక అంశాలపై ఆసక్తిని పెంచడం విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు పెంపొందించేందుకు గాను కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ అవార్డులను అందజేస్తుందని విద్యార్థుల ఆలోచనలకు ఇన్‌స్పైర్-మానక్ ఒక వేదికగా ఉంటుందన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదివే 6-10వ తరగతి విద్యార్థుల నుంచి తప్పనిసరిగా ఐదు నామినేషన్లు పంపించి, విద్యార్థులను రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అయ్యేలా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో గోవిందరాజులు తదితరులు ఉన్నారు.

సీమంతాలు, అక్షరాభ్యాస కార్యక్రమాలు

అమ్రాబాద్, జూలై 20 : అమ్రాబాద్, పదర ఉమ్మడి మండలాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో 'అమ్మమాట-అంగన్‌వాడీ బాట' కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం పదర మండలం వంకేశ్వరం గ్రామ పంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడు సంవత్సరాల పిల్లలకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించినట్లు సీడీపీవో దమయంతి తెలిపారు. అదేవిధంగా అమ్రాబాద్ మండలం లక్ష్మాపూర్ తండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించి రెండున్నర సంవత్సరాల చిన్నారుల పేర్లను నమోదు చేసుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సువర్ణ, సునీత, మహిళ హబ్ వెంకటమ్మ, కోనేరు సంస్థ బాలకృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు వల్లమ్మ, అలివేల, ఆశ కార్యకర్తలు, గర్భిణులు, తల్లులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

- సీనియర్ సివిల్ జడ్జి సబిత

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సబిత

తాడూరు, జూలై 20 : విద్యార్థులు తమ తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న ఆశయాలకు అనుగుణంగా విద్యను అభ్యసించి ఉన్నత స్థానానికి ఎదగాలని సీనియర్ సివిల్ జడ్జి సబిత అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో యాంటి ర్యాగింగ్ చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి సబిత హాజరై మాట్లాడుతూ విద్యార్థులకు సాధనతో కూడిన చదువు అవసరం అన్నారు. కార్యక్రమంలో డీఈవో గోవిందరాజులు, హెచ్ఎం పర్వత్‌రెడ్డి, ఎంఈవో భాస్కర్‌రెడ్డి, న్యాయవాదులు శ్రీనివాసులుగుప్తా, మధు, భవానీ బాయి, పవన్, శివరాంతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట' ర్యాలీలు

కోడేరు/ఉప్పునుంతల, జూలై 20 : మండల కేంద్రంలోని 1, 2వ అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం 'అమ్మమాట -అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా గ్రామంలో చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. 0 నుంచి 5 ఏళ్లలోపు వయస్సు ఉన్న బాలబాలికలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ అంగన్‌వాడీ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులకు అమ్మ ఒడి లాంటివని ఉప్పునుంతల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బీపాషా అన్నారు. శనివారం ఉప్పునుంతల మండలంలోని సదగోడులో 'అమ్మమాట-అంగన్‌వాడీ బాట' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. అలాగే ఐదుగురు చిన్నారుల పేర్లను ప్రాథమిక పాఠశాలలో నమోదు చేయించారు. కార్యక్రమంలో అంగాన్‌వాడీ టీచర్లు వరలక్ష్మి, నాగమణి, ఆయాలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్ సావిత్రి ఉన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి చేర్చాలి

డిటీకి వినతి పత్రాన్ని అందజేస్తున్న ముదిరాజ్‌లు

పెద్దకొత్తపల్లి, జూలై 20 : ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏ గ్రూప్